ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును శనివారం టిడిపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర లబ్దిదారునకు అందజేశారు. పట్టణంలోని 3వార్డు వివేకానంద కాలనీకి చెందిన మాచర్ల గణపతిరావుకి 63,105 రూ,,చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉన్న వాళ్లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందజేస్తున్నా రన్నారు. లబ్ధిదారుడు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం ఎమ్మెల్యే విజయ్ చంద్రని సహాయం కోసం అడిగితే అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, వారు చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోమని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డికి స్వాగతం పలికిన జేసీ, డిఆర్ఓ, సబ్ కలెక్టర్లు

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్ రెడ్డిని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు డా.ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చెంలను అందజేశారు. జిల్లాలో పలు అంశాలపై వారు వివరించారు. జిల్లా అధికారులు రెవెన్యూ అధికారులు వివిధ శాఖల అధికారులు వివిధ సంఘాలకు చెందిన నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్ రెడ్డిని జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఏఎస్పీ అంకితా సురానా, జిల్లాలో పలువురు పోలీస్ అధికారులు, పలు శాఖలజిల్లా అధికారులు కలిసి పుష్ప గుచ్చెంలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలపై కొద్దిసేపు మాట్లాడారు.

పార్వతీపురం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లా కలెక్టర్ల బదిలీల్లో భాగంగా మన్యం జిల్లాకు విచ్చేసిన నూతన కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ను స్థానిక రెవెన్యూ తాసిల్దార్ సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. శనివారం జిల్లా కలెక్టర్ బాధ్యతలు చేపట్టేందుకు నూతన కలెక్టర్ తన కార్యాలయానికి విచ్చేశారు ఈ సమయంలో తాసిల్దార్ సురేష్ కలెక్టర్‌ను తన చాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచు అందజేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతోపాటు రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు ఉన్నారు.

జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్రను వేశారు

ఆత్మీయ వీడ్కోలు సభలో కలెక్టర్‌కు అధికారుల ప్రశంసలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా అభివృద్ధిలో తనదైన పరిపాలనా విధానాలతో, సేవా భావంతో జిల్లా ప్రజలు, అధికారులందరి మన్ననలు పొంది చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అని జిల్లా అధికారులు ప్రశంసలు కురిపించారు.జిల్లా ఆవిర్భావం తరువాత రెండో జిల్లా కలెక్టరుగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి తనదైన ముద్రను వేశారని కొనియాడారు. జిల్లా కలెక్టరుగా విశిష్ట సేవలందించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు అభినందన సభ శుక్రవారం స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాలులో జరిగింది.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ వెనుకబడిన మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు ఆయన కృషి, పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. కలెక్టరుగా వచ్చిన రెండు, మూడు మాసాల్లోనే జిల్లాపై పట్టు సాధించారని, వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి మంచి కలెక్టరుగా పేరు పొందారని తెలిపారు. జిల్లా కలెక్టర్ గొప్ప స్నేహశీలి, మృదుస్వభావి, పరిపాలనా సంస్కర్త, అందర్ని కలుపుకొని వెళ్లే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన జిల్లాకు అందించిన సేవలు అమోఘం, అద్వితీయమని కొనియాడారు. జిల్లాలో ఒక విజన్ తో కంటైనర్ ఆసుపత్రి, కంటైనర్ అంగన్వాడీల ఏర్పాటు, ఆసుపత్రులు, వసతి గృహాలు, పాఠశాలల మార్పుకు శ్రీకారం చుట్టారని అన్నారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్, ఎనీమియా కమిటీలు ఏర్పాటుచేసి రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు, గిరిజన గ్రామాలకు రహదారులు, సెల్ టవర్ల ఏర్పాటుకు కృషి మరువలేనిదని అన్నారు. నాలుగు బ్లడ్ బ్యాంకులు, సికిల్ సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షా యంత్రాలను తెప్పించడం, ఏడు ఆసుపత్రులను అప్ గ్రేడ్ చేయడం, విద్యా రంగంలో పదో తరగతిలో వరుసగా మూడవ సారి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపి హ్యాట్రిక్ సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. కిచెన్ గార్డెన్ ద్వారా ఆర్గానిక్ ఆకు, కూరగాయలను విద్యార్థుల ఆహారంలో అందించడం, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులను ఒకే తాటిపై నడిపించడం, ఎరువులు, యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు, పీజీఆర్ఎస్ ద్వారా అర్జీదారుల, రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతులు, ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచారాని కొనియాడారు.

లోక్ అదాలత్ ద్వారా 460 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-బెలగాం : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 460 కేసులను ఇరువురి అంగీకారంతో రాజీ చేయడం జరిగిందని పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వలన ఖర్చులు తగ్గుతాయని, మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుందని జడ్జి అన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగేకన్నా కేసులను సామరస్యం పరిష్కరించుకుని రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గమని తెలిపారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా, కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే కోర్టుకు మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్టు తిరిగి చెల్లిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్ లో ఎక్కువగా క్రిమినల్ కేసులను రాజీ చేయడం జరిగిందని మొత్తం 460కేసులు పరిష్కరించడం జరిగిందని వివరించారు. సివిల్ కేసులు -23, క్రిమినల్ కేసులు-431, మోటారు యాక్సిడెంట్ -7, కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని, కక్షిదారులు ప్రతీ ఒక్కరు ఇలాంటి సదావకాశాలను వినియోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. సౌమ్యా జాస్పిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.చంద్రకుమార్, బార్ ప్రెసిడెంట్ నల్ల శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి సూపర్ విజన్‌తో జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకువెళ్తా

జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లా అధికారులందరూ సమన్వయంతో పని చేసి, సూపర్ విజన్‌తో జిల్లాభివృద్ధికి, జిల్లాను ప్రగతి పదములోకి తీసుకువెళదామని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు.నూతన జిల్లా కలెక్టరుగా శనివారం ఉదయం వేదమంత్రాలు సాక్షిగా బాధ్యతలను స్వీకరించారు. జిల్లా అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికి వారంతా పుష్పగుచ్ఛములు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ అనుభవాలు జిల్లా అభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని, మీ సూపర్ విజన్ తో జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. జిల్లా అధికారులందరూ ఒక టీమ్‌గా పనిచేసి, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు లక్ష్యసాధనలో గడువుకు ముందే ప్రగతిని సాధించాలని స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో సమస్యలు ఉంటే, వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖకు చెందిన లక్ష్యాలు, ప్రగతి, రానున్న రెండేళ్లలో సాధించబోయే ప్రణాళిక విజన్ ను పారదర్శకంగా రచించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన లబ్దిదారులకు అందించేలా అన్ని శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అంతకుముందు గతేడాదికి, ఈఏడాదికిగల పురోగతిపై ఆరా తీసిన ఆయన జిల్లాలో వృద్ధి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రగతి పవర్ పాయింట్ ప్రజెంటేషను ద్వారా వివిధ శాఖలు సాధించిన పురోగతిని అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు డా.ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్ఓ కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై. క్రాంతి కుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు,జిల్లా మత్స్య శాఖాధికారి టి.సంతోష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, డి.ఆర్.డి.ఏ, డ్వామా, ఐసీడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, టి.కనకదుర్గ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి వై.నాగేశ్వరరావు, జిల్లా విద్యా శాఖాధికారి బి.రాజ్ కుమార్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి : కలెక్టర్ ప్రభాకరరెడ్డి

విశాలాంధ్ర-బెలగాం : ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలను, వార్డులను పరిశీలించి వైద్యాధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలను జారీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని రోగులు, బాలింతలతో మాట్లాడిన కలెక్టర్ వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ, సమస్యలపై ఆరా తీశారు. కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి వార్డులను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రోగులతో పాటు సహాయకులకు కూడా భోజనం ఏర్పాటుచేయాలని, ఇందుకు ఆసుపత్రిలోనే ఒక క్యాంటీన్ పెట్టేలా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పడకలతో పాటు అదనపు పడకలను పెంచడానికి, పెండింగులో ఉన్న పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ పనులు నిర్ణీత సమయానికి ముందే పూర్తిచేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ సిజేరియన్ల సంఖ్యను తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. సిజేరియన్ రేటు ఎక్కువగా ఉన్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్, డిఎంహెచ్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ప్రసవాలకు ముందు, తదుపరి రక్తహీనత సమస్యలు ఉండరాదని తేల్చిచెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అందుకు తగిన విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు షెడ్యూలు కులాల సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి విద్యార్థినులతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్యను అందించాలని ఆదేశించారు. ఎల్లవేళలా వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వారికి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంగా ఉండేలా పర్యవేక్షిస్తూ ఉండాలని వసతి గృహ సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డా. గొర్లి నాగభూషణరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా. మంతిని వినోద్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కందిరీగల దాడిలో గిరి మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : కందిరీగల దాడిలో గిరి మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోతంగి పంచాయితీ కోసంగి గ్రామానికి చెందిన మఠం. ఇచ్చమ్మ (40) గిరి మహిళ శనివారం మేకలకు మేత కోసం గ్రామ శివారులో తీసుకెళ్లిన ఆమెపై పొదల నుంచి కందిరీగలు దాడి చేశాయని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆమె తలపై, చేతులపై కందిరీగలు దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయని, ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హటాహుటిన ఆమెను చికిత్స నిమిత్తం దుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

ఎమ్మెల్యే దృష్టికి ఎలుగులమెట్ట క్వారీ సమస్య

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : తమ రెవెన్యూ పరిధిలో ఉన్నటువంటి ఎలుగుల మెట్ట పై మైనింగ్ క్వారీ నిర్వహించేందుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ మహిళలు స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యేను కారాడవలస గ్రామానికి చెందిన మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కలిసి వారి ఆవేదనను వెళ్ళబుచ్చారు. మైనింగ్ వారి నిర్వహణకు అనుమతులు ఇస్తే తమ పంట భూములు నాశనమవుతాయని, అలాగే మూగజీవాలకు పశు గ్రాసం లభించక మృత్యువాత పడతాయని వాపోయారు. ఎలుగులమెట్ట వద్ద మైనింగ్ క్వారీ నిర్వహణకు అనుమతులు ఇవ్వొద్దని, ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో కారాడవలస, పెదగొండపల్లి గ్రామ ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. దీనిపై వినతి పత్రం అందుకున్న ఎమ్మెల్యే మహిళలతో మాట్లాడుతూ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తానని భరోసా ఇచ్చారు.

రహదారి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలంలోని గడుతూరు పంచాయతీ వెదురుపల్లి నుంచి నెయ్యాలబంద రహదారి పనులకు ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, స్థానిక సర్పంచ్ అప్పలమ్మ పాల్గొని ప్రారంభించారు. పీఎం జన్‌మాన్ నిధులు 10.83 కోట్ల తో 10కిలో మీటర్ల మేర పోడవు బీటీ రోడ్డు పనులు చేపట్టానున్నట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో సుమారుగా 13 గ్రామల గిరిజనులకు రహదారి సౌకర్యం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొర్రా పద్మా, ఉప సర్పంచ్ చిన్నయ్య, నాయకులు కొండపల్లి సింహాలచం, పిన్నయ్య, కొండలరావు, బోయన బాబురావు, నుర్మతి సర్పంచ్ సూరిబాబు, కొండలరావు, అప్పారావు, వి.కృష్ణమూర్తినాయుడు, కొండబాబు, వెంకటరావు తదతరులు పాల్గొన్నారు.

15 నుంచి ఎఫ్‌ఎంబి కార్యక్రమం

విశాలాంధ్ర-హుకుంపేట : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పుట్ అండ్ మౌత్ థిస్ ఇస్ ఎప్పండి ఏడో విడత తీగ కార్యక్రమం నిర్వ హించడం జరుగుతుందని స్థానిక మండల పశువైద్యాధికారి కే చరణ్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నాలుగు నెలల వయస్సు పైబడిన అన్ని పెద్ద ఆవులు, ఎద్దులు, గేదెలకు ఉచితంగా ఎఫ్ఎండి టీకాలు వేయడం జరుగు తుందని, సచివాలయ పరిధిలోని ఏహెచ్ఏలు గ్రామాలకు వచ్చి టీకాలు వేస్తారని చెప్పారు. ప్రతి ఒక్క రైతు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజేంద్రపాలెం పిహెచ్‌సి వైద్యాధికారిగా జగదీష్‌నాయక్ నియామకం

విశాలాంధ్ర-కొయ్యూరు: కొయ్యూరు మండలం రాజేంద్రపాలేం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన (రెండవ) వైద్యాధికారిగా జగదీష్ నాయక్‌ని నియమిస్తూ జిల్లా వైద్యాధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు నూతన వైద్యాధికారి శుక్రవారం ఇక్కడ వైద్యాధికారిగా భాధ్యతలు స్వీకరించారు. గత ఆరు నెలలుగా ఈ పిహెచ్‌సిలో వైద్యుల కొరత ఉండగా యూ.చిడిపాలెం పిహెచ్‌సి నుంచి డిప్తేషన్ పై ఒక వైద్యాధికారిని నియమించగా కొంత మేరకు ఇబ్బంది తొలగింది. రాష్ట్ర వ్యాప్తంగా నూతన వైద్యాధికారుల నియామకంలో భాగంగా ఈ పిహెచ్‌సికి ఇద్దరు వైద్యాధికార్లను వారం వ్యవధిలో నియమించటంపట్ల స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పిహెచ్‌సి వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, డిఎంఅండ్ హెచ్‌వోకు వీరంతా కృతజ్ఞతలు తెలియజేసారు.

వ్యవసాయాధికారిగా రాజకుమార్ నియామకం

విశాలాంధ్ర-కొయ్యూరు : కొయ్యూరు మండల నూతన వ్యవసాయాధికారిగా బి. రాజకుమార్ నియమితులైయ్యారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఏఓ భానుప్రియాంక పాడేరులో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం నకు డిప్యూటెషన్‌పై బదిలీ చేశారు. జిల్లా కార్యాలయం పాడేరులో టెక్నికల్ విభాగంలో ఏఓగా పనిచేసే రాజకుమార్ ను కొయ్యూరు మండలం నూతన ఏఓగా నియమిస్తూ జిల్లా జాయింట్ డైరక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుదవారం నూతన ఏఓ రాజకుమార్ ఇక్కడ నియమితులైయినట్టు తెలియజేసారు. జిల్లాలోనే అతిపెద్ద విస్తీర్ణం కలిగిన (కొయ్యూరు)మండలం కావటంతో పరిపాలన సౌలభ్యం నేపథ్యంలో రాజకుమార్ ను ఇక్కడ నియమించినట్టు అధికార్లు తెలిపారు.

మృతిచెందిన కార్యకర్త కుటుంబాన్ని జనసేన నాయకులు పరామర్శ

విశాలాంధ్ర-జీకే వీధి : దేవరపల్లి పంచాయతీ కోడిసింగి గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్త సతీష్ కుమార్ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా జీకే వీధి మండల జనసేన పార్టీ నాయకులు ఆ కుటుంబానికి ఓదార్చారు. జానపద కళల & సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు మండల జనసేన పార్టీ నాయకులు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాతోపాటు పార్టీ కార్యక్రమంలో చురుకుగా నడిచిన మంచి కార్యకర్తని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయమని సతీష్ కుమార్ ఆత్మకు శాంతి కలగాలని పార్థిస్తున్నాం అని వారన్నారు. అన్ని విధాలుగా కష్ట సుఖాలలో జనసేన పార్టీ మీకు అండగా తోడుగా ఉంటామని భరోసా కల్పిస్తూ ఆ కుటుంబానికి పరామర్శించి ఆధైర్య పడకుండా మనో ధైర్యంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, దేవరపల్లి ఉపాధ్యక్షులు కళ్యాణ్ చక్రవర్తి, గుండ్లు రఘువంశి, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్,మాచర్ల అనిల్, ఉపాధ్యక్షులు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతులు గ్రామం రోడ్డు నిర్మాణం చేపట్టండి

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం జీకే వీధి పంచాయతీ నూతులు గ్రామంలో గతంలో కురిసిన భారీ వర్షాలకు మట్టిరోడు కొట్టుకొని పోవడంతో ద్విచక్ర వాహనాలు పాదాసారలు నడవడానికి ఇబ్బందిగా మారడంతో కొట్టుకొనిపోయి రోడ్డును యువత అంతా కలిసి మట్టితో రోడ్డును పూడ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా రోడ్డు నిర్మాణం జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, యువత కోరారు.

మంచినీరు కుళాయిలు ప్రారంభం

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం పెదవలస పంచాయతీ పరిధి రంపులు టెంట్ల వీధి గ్రామములో స్థానిక సర్పంచ్ పాంగి కృష్ణారావు ఆధ్వర్యంలో మంచినీటి కొళాయిలు శనివారం ప్రారంభించారు. మంచినీటి సమస్య తీర్చినందుకు సర్పంచ్ పాంగి కృష్ణారావు కు రంపులు టెంట్లవీధి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఈ గ్రామానికి మంచినీటి ట్యాంక్ లేక ఊటగెడ్డ నీరు తో ఇబ్బంది పడ్డామని, మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టి ట్యాంక్ నుండి కుళాయిలు ద్వారా మంచినీరు సరఫరాతో మంచినీటి సమస్య తీరినట్టేనని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనందరావు, లమ్మసింగి రమేష్, వార్డు మెంబర్ కాంతమ్మ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వద్దు... ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

- 90 శాతం రాయితీ పై రాజ్మా విత్తనాలు పంపిణీ
- జీసిసి మాజీ చైర్మన్ ఎం వి వి ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : మన్యంలో మహమ్మారి గంజాయి పంటలు వద్దు ప్రత్యామ్నాయ పంటలే ముద్దు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ జీసిసి చైర్మన్ ఎంవివి ప్రసాద్ అన్నారు శనివారం మండలంలో చీకి పాలెం రైతు సేవ కేంద్రంలో ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ తో అందించే రాజ్మా విత్తనాలు ఎం.వి వి ప్రసాద్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీ రాజ మా విత్తనాలు గిరిజన రైతాంగం సద్వినియోగం చేసుకొని సరైన సమయంలో విత్తనాలు వేయాలని రైతులకు సూచించారు. ఈసమయంలో గంజాయి పంటలు వైపు మొగ్గుచూపు కుండా ప్రత్యామ్నాయ పంటల వైపు గిరిజన జనం ఆసక్తి చూపాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలో 180 క్వింటాల విత్తనాలు సరఫరా కాగా 10 కేజీలు చెప్పున ఒక్కొక్క రైతుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కూ నిశెట్టి చంద్రరావు భూధరాళ్ల పంచాయతీ వార్డు మెంబర్ సాగిన చిరంజీవి వంతమ్రి నారాయణ బిజెపి నాయకులు కొర్ర త్రినాథ్ మండల వ్యవసాయ శాఖ అధికారి రాజకుమార్ సిబ్బంది రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-జీకే వీధి : జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పెదవలస నుండి కేడీపేట వెళ్తున్న (ధాన్యం తౌడు లోడుతో) లారి పెదవలస ఘాట్ రోడ్లో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీ చక్రాలు రోడ్డు చివరికి వెళ్లడంతో లారీ అదుపుతప్పి ఒరిగింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, కూలీలు సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై ది సోమ్ ట్రైబల్ లీడర్స్ జాతీయ పరిశోధన టీం ఆరా

ఏపీ ఆదివాసీ జేఏసీ,ఆదివాసీ సంక్షేమ పరిషత్

విశాలాంధ్ర-దేవీపట్నం : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 14వ తేదీన పెద్దభీంపల్లి-2, పెద్దభీంపల్లి-3 కొండ మొదలు ఆర్ అండ్ ఆర్ కాలనీ సందర్శించనున్న సోమ్ ట్రైబల్ లీడర్స్ జాతీయ పరిశోధన టీమ్ ఝార్ఖండ్ పోలవరం నిర్వాసితులను స్వయంగా కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్న ది సోమ్ ట్రైబల్ లీడర్స్ జాతీయ పరిశోధన టీమ్ ఝార్కండ్ ఝార్కండ్ రాష్ట్రం నుండి ది సోమ్ ట్రైబల్ లీడర్స్ జాతీయ పరిశోధన టీమ్ పెద్దభీంపల్లి-2, ఆర్అండ్ఆర్ కాలనీ పెద్దభీంపల్లి-3 కొండ మొదలు కాలనీ సందర్శించించి ప్రజలతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాటం జరుగుతుందని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, ఏపీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దభీంపల్లి-2 మరియు పెద్దభీంపల్లి-3 ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసముంటున్న పోలవరం నిర్వాసితులతో ఝార?ండ్ రాష్ట్రం నుండి వచ్చిన, ది సోమ్ ట్రైబల్ లీడర్స్ జాతీయ పరిశోధన టీమ్ స్వయంగా మాట్లాడి 2013 కొత్త భూ సేకరణ చట్టం ప్రకారం శాస్త్రీయ సమగ్ర పునరావాసం నిబంధనల ప్రకారం ప్రజలందరికీ ప్రభుత్వం నుండి న్యాయ బద్ధంగా అందవాల్సినవి అందుతున్నాయో లేదో తెలుసుకోవడం జరుగుతుందన్నారు. 15వ తేదీన తున్నూరు గ్రామాన్ని సందర్శించి కొండ రెడ్డి తెగ ప్రజలు ఇబ్బందులు తెలుసుకోవటం జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించటం జరుగుతుందన్నారు. అలాగే 16 తేదీ నుండి 20 వ,తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ మరియు విలీన ముంపు మండలాలైన చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాలను సందర్శించి పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా సర్వం త్యాగం చేసిన పోలవరం బాధితులతో నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవటం జరుగుతుందన్నారు. అలాగే జీఓ నెంబర్ 3 రద్దు చేయటం వలన ఆదివాసీ పట్టా భద్రులకు జరుగుతున్న అన్యాయం గురించి, 1/59 చట్టం, 1/70 చట్టం,పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం,2013 భూ సేకరణ చట్టం మరియు హక్కులు ఏవిధంగా అమలవుతున్నాయో, అలాగే ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ఏవిధంగా అమలవుతున్నాయో తెలుసుకోవటం జరుగుతుందన్నారు. అనంతరం చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో చర్చించనున్నారు మరియు పరిశోధించనున్నారని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైద్యారోగ్యశాఖ అధికారులు

విశాలాంధ్ర-బెలగాం : నూతనంగా విధుల్లో చేరిన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డిని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డా. గొర్లి నాగభూషణరావు ఇతర వైద్యశాఖ అధికారులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ప్రోగ్రాం అధికారులు వారు నిర్వర్తిస్తున్న విధి నిర్వహణల గురించి డిఎంహెచ్ఓ వివరించారు. జిల్లాలో ఎక్కడా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. డిఐఓ డా. విజయమోహన్, ప్రోగ్రాం అధికారులు డా. టి. జగన్ మోహనరావు, డా. రఘు, డా. మంతిని వినోద్, డిఎంఓ మణి, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

పాడేరులో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 'గాం మల్లుదొర' పేరు పెట్టాలి

రామలక్ష్మి గడుతూరి, కార్యవర్గ సభ్యులు, భారతీయ ఆదివాసుల సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర-అనంతగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య పేరును ప్రభుత్వ ఉత్తర్వు (జిఓ) ఎమ్ఎస్ నంబర్ 132 జారీ చేయడం ద్వారా నామకరణం చేసింది. ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలకు ప్రఖ్యాత బయోకెమిస్ట్ యల్లాప్రగడ సుబ్బారావు పేరు పెడుతునున్నట్లు ఆరోగ్య, వైద్యం మరియు వైద్య విద్య మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ ఇటీవల ప్రకటించారు. ఇదే విధంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాట స్ఫూర్తి మరియు దేశభక్తిని భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరులోని ప్రభుత్వ వైద్య కళాశాలకు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు మరియు విశాఖపట్నం మొదటి పార్లమెంటు సభ్యుడుగా పనిచేసిన శ్రీ గాం మల్లుదొర పేరు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు వైద్య, ఆరోగ్య మరియు వైద్య విద్య మంత్రి సత్య కుమార్‌యాదవ్‌ను అభ్యర్థిస్తున్నట్లు కాళే శ్రీనివాసు, కాంగ్రెస్ నాయకుడు విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. గాం మల్లుదొర ఒక ప్రముఖ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, 1922 నుండి 1924 వరకు జరిగిన రంప తిరుగుబాటు (దీనిని మన్యం తిరుగుబాటు అని కూడా పిలుస్తారు) సమయంలో అల్లూరి సీతారామ రాజు నాయకత్వంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఇతను మరియు ఇతని సోదరుడు గాం గంటందొర చురుకుగా పాల్గొన్నారు. వీరు ఇతర గిరిజన నాయకులతో కలిసి అల్లూరి సీతారామరాజు విశ్వసనీయ సేనాపతులుగా కీలక పాత్ర పోషించారు. బ్రిటిష్ వారిపై గెరిల్లా దాడులను నిర్వహించడంలో మరియు నాయకత్వం వహించడంలో వీరు కీలక పాత్ర పోషించారు. 1923లో రంప తిరుగుబాటు సమయంలో అజ్ఞాతంలో ఉన్నప్పుడు గాం మల్లుదొరను బ్రిటిష్ సైన్యాధికారులు బంధించి మరియు మరణశిక్ష విధించారు, తరువాత దానిని అండమాన్ దీవులలో జీవిత ఖైదుగా మార్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గాం మల్లుదొర అండమాన్ జైలు నుండి విడుదల కాబడ్డారు. 1955సంవత్సరంలో జరిగిన మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలలో విశాఖపట్నం నుండి పార్లమెంట్ సభ్యుడుగా ఎన్నికై సేవలను అందించారు. తన జీవితాంతం దేశ సేవలో తరించిన ఇటువంటి మహనీయుని సేవలు, త్యాగాలు మరియు పోరాట పటిమ భవిష్యత్ తరాలు గుర్తుపెట్టుకొనేలా అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు గాం మల్లుదొర పేరుపెట్టాలని గిరిజన ప్రజలందరూ ఆకాంక్షిస్తున్నారు. ఈ ప్రజల కోరికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతున్నట్లు రామలక్ష్మి గడుతూరి, కార్యవర్గ సభ్యులు, భారతీయ ఆదివాసుల సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు.

ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరి బైక్ జాతాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం. : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫేడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుండి ఆర్థిక, విద్యా రంగా సమస్యలపై రణభేరి బైక్ జాతా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుండి బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుందని మండల కార్యదర్శి ఎన్ రామకృష్ణ అన్నారు. ములకనపల్లి లోని జి పి యస్ పాఠశాల వద్ద రణభేరి బైక్ జాతా గోడపత్రికను మండల కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. మండల కార్యదర్శి ఎన్. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యు.టి.ఎఫ్. మండల ప్రధాన కార్యదర్శి ఎన్. జగదీష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం పాలకులకు పట్టదనీ, నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులు తరిలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారనీ,విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 'యోగాంధ్ర, మెగాపేరెంట్ టీచర్స్ మీటింగ్ అంటూ బోధనకు ఆటంకం కలిగించారనీ, అదే సమయంలో ట్రైనింగ్‌ల పేరుతో ఉపాధ్యాయులను బడికి దూరం చేసారని, ప్రభుత్వ ఆలోచనలాగే అధికారుల తీరుతుందనీ, బోధనేతర కార్యక్రమాల చుట్టూ టీచర్లను ఊపిరాడకుండా చేస్తున్నారని, విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పాలని కాకుండా ఆన్లైన్ అప్ లోడింగ్ కార్యక్రమంగా విద్యాశక్తి కార్యక్రమాన్ని మార్చేశారని, స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను బలవంతంగా నిర్బంధిస్తున్నారనీ, ఇక పరీక్షల మూల్యంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేచారని, అధికారులు క్షణం క్షణం పెడుతున్న ఒత్తిడి భరింపరానిదిగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ రామకృష్ణ, ఎ రాము, ఎన్ చిన్న ప్రసాద్, బి సీతారామరాజు ఎన్ ప్రసాద్, యస్ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కలిసిన సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలంలో సినీ నటులు ఆర్ నారాయణమూర్తి పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణని వీరఘట్టం క్యాంప్ కార్యాలయం వద్ద కలిశారు. సోమవారం రిలీజ్ అవుతున్న తన సినిమా పాలకొండ గౌరీ థియేటర్ నందు మ్యాట్నీ షో చూడమని విన్నవించుకున్నారు. అదేవిధంగా జనసేన ఎమ్మెల్యేతో ఆర్.నారాయణ మూర్తి కాసేపు ముచ్చటించారని ఎమ్మెల్యే తప్పనిసరిగా సినిమాను తన బృందంతో చూస్తానని తెలిపారన్నారు.

ముడుపులతో సింహాచలం తరలివెళ్తున్న భక్తజనం

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతి గురువారం ముడుపుల పూజలకు పెద్దఎత్తున భక్తులు వస్తున్న సంగతి తెలిసిందే. 9వారాలపాటు భక్తిశ్రద్ధలతో ముడుపుల పూజలను చేస్తున్న భక్తులు, పూజలు పూర్తయిన తర్వాతవచ్చే శనివారం ఆముడుపులను తీసుకొని సింహాచలం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లి అక్కడ హుండీలో వేయడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం వేకువజాము నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చేసి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి, శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి, శ్రీవేణుగోపాల స్వామివారికి, శ్రీ రాజ్యలక్ష్మి తల్లికి పూజలను నిర్వహించి వారి ముడుపులను ఆలయం నుంచి తీసుకొని సింహాచలం వెళ్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు రామానుజాచార్యులు, టీటీడీ ధర్మకర్త శ్రీనివాసరావులు తెలిపారు. తొమ్మిది వారాలపాటు ముడుపుల పూజలో ప్రతి గురువారం పాల్గొని, ముడుపుల పూజలు పూర్తయ్యాక శనివారం నాడు సింహాచలముతోబాటు తమ ఇష్ట దేవాలయాలకు కుటుంబ సభ్యులు అందరితో కలిసి వెళ్లి ముడుపులను హుండీలో వేసి పూజలను చేస్తున్నామన్నారు. ముడుపుల పూజలతో తమకు మంచి జరుగుతుందని భక్తులు తెలియజేయడం గమనార్హం. సీతానగరంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతిగురువారం జరుగుతున్న ముడుపుల పూజలతోనూ, శనివారం తీసుకుని వెళ్లడానికి వస్తున్న పూజలతోనూ సీతానగరం ఎంతో ప్రాచుర్యం పొందినట్లు ఆలయ ధర్మకర్త దంపతులు చెలికాని వెంకట గోపాలకృష్ణ భారతీ దంపతులు తెలిపారు. చాలామంది భక్తులు నిరంతరముగా ముడుపులు పూజలను నిర్వహించడం గమనార్హం. ఇదిలా ఉండగా సోమవారంనాడు వైష్ణవ కృష్ణాష్టమి సందర్భంగా ఆరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం పూజా కార్యక్రమాలు జరిపించబడతాయని, కావున జైశ్రీమన్నారాయణ భక్తులందరూ దీనిని గమనించాలన్నారు.

జిల్లాలో పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చింది : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లాలో దాదాపు 14 నెలలు పని చేశానని, ఇక్కడ పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తన మనోగతాన్ని పంచుకున్నారు.ఇది మంచి జిల్లా అని, మనసున్న జిల్లా అని, పచ్చదనం కలిగిన జిల్లా అని కొనియాడారు.తాను గతంలో గిరిజన ప్రాంతాల్లో పనిచేశానని, అక్కడ చేయడం ఆనందంగా ఉంటుందని గుర్తు చేసుకున్నారు. ఆ తదుపరి మన్యం జిల్లాకు వచ్చానని, ఇక్కడ గిరిజన సంప్రదాయాలు, వారి ప్రేమాభిమానాలు, కల్మషం లేని హృదయాలు వెలకట్టలేమని పేర్కొన్నారు. జిల్లా అధికారుల సహకారంతోనే ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానం సాధించగలిగిందని అన్నారు. అందరి సహకారంతో ఎన్నో రకాల మంచి పనులు చేపట్టగలిగామని చెప్పారు. పరిపాలనాపరమైన ఎన్నో అంశాల్లో అధికారులు, సిబ్బంది సహకరించారని పేర్కొన్నారు. తన పాలనా కాలంలో అన్ని విధాలుగా సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఏఎస్పీ అంకిత సురానా, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు డా.ఆర్ వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్,డిఆర్ఓ కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్. భాస్కరరావు, డి.ఆర్.డి.ఏ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా.టి.కనక దుర్గ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వై.నాగేశ్వర రావు, జిల్లా విద్యా శాఖాధికారి బి.రాజ్ కుమార్, వివిధ అసోసియేషన్ల అధ్యక్షులు,రెవిన్యూ అధికారులు, ఎంపిడిఓలు, ఇతర జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.

రొంపిల్లి సచివాలయం వద్ద సెల్ టవర్ ఏర్పాటు చేయాలి

నెట్‌వర్క్ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బంది

విశాలాంధ్ర-అనంతగిరి : పంచాయతీ కేంద్రం రావాలంటే 15 కిలోమీటర్ల దూరంలో వస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నెలకు ఒకసారి. మండల స్థాయి అధికారులు బృందం. కొంపెల్లి పంచాయతీ కేంద్రాన్ని సందర్శించాలి. పిఓ కరెంట్ లేని గూడెం గ్రామాన్ని సందర్శించాలి. ఎగువ గుడ్డి, కుందేలుగుడ్డే గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. అల్లూరి సీతారామరాజు జిల్లా మారుమూల రొంపిల్లి పంచాయతీ పరిధిలో13 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 2000 మంది జనాభా కలిగి ఉన్నారు. ప్రత్యేక సచివాలయం ఉంది. నెట్వర్క్ సౌకర్యం లేకపోవడంతో ఆదివాసి గిరిజనులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. రొంపిల్లి పంచాయతీ కేంద్రంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలి. నేటికీ గూడెం గ్రామంలో కరెంట్ సౌకర్యం లేదు. కుందేలు గుడ్డి. ఎక్కు గుడ్డి రెవిన్యూ రికార్డులో పేరు లేవు. వీరికి వాటర్ స్కీములు కూడా లేవు. వీటిని రెవిన్యూ గ్రామాలుగా గుర్తించాలి. రొంపిల్లి పంచాయితీ ప్రజలు అనంతగిరి మండల కేంద్రానికి రావాలంటే కనీసం 500 రూపాయలు చేతిలో ఉండాలి. చేతిలో డబ్బులు లేకపోతే. ఎన్ని సమస్యలున్నా చెప్పుకోవడానికి దిక్కులేదు. ఇటువంటి పరిస్థితుల్లో అధికార యంత్రాంగం నెలలో ఏదో ఒక రోజు రొంపిల్లి పంచాయితీ పనిలో మూడు గ్రామాలను సందర్శించాలి. ఈ గ్రామాలు వెనకబడినటువంటి ఆదివాసి గిరిజనులు. నేటికీ కుందేలు గుడ్డే. గ్రామంలో 28 ఇల్లు ఉన్నాయి ఒక మందికి ఓట్లు లేవు. కొంతమందికి ఆధార్ కార్డులు లేవు. ఈవిధంగా అనే గ్రామాల్లో సంస్థతో బాధపడుతున్నారు. తక్షణమే జిల్లా అధికారి యంత్రాంగం మా గ్రామాల సందర్శించాలి. సమస్యలు పరిష్కారం చేయాలి. రెండవ వార్డ్ సభ్యుడు సోముల అప్పలరాజు. తుంపల్లి పంచాయతీ అభివృద్ధి సాధన కమిటీ కన్వీనర్ కోటపర్తి సింహాచలం మరియు 10 గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారి యంత్రాంగం చర్యలు చేపట్టకపోతే విశాఖపట్నంలో జరిగే జిల్లా పరిషత్తు పాలకవర్గ సమావేశం వద్ద ఆదివాసి గిరిజనులు భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తాం.

ఆలయాల అభివృద్ధికి దోహదపడండి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : ప్రజలు, దాతలతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో దుకాణ సముదాయాల వ్యాపారస్తులు సకాలంలో దేవాదాయ శాఖకు చెల్లించాల్సిన అద్దెలు సకాలంలో చెల్లించి ఆలయ అభివృద్ధికి దోహదపడాలని, ఉమ్మడి ఆలయాల ఈవో వి.వి సూర్యనారాయణ సూచించారు. పెండింగ్‌లో ఉన్న దుకాణ సముదాయాల అద్దెల చెల్లింపు త్వరగా చేపట్టాలని ఆయా యజమానులకు సూచించారు. పట్టణంలో గల జగన్నాథ స్వామి, సీతారామ స్వామి, గాంధీ చౌక్రితో పాటు సత్యనారాయణ మూర్తి ఆలయాలలో ఉన్నటువంటి దుకాణ యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఈనెలాఖరులోగా పెండింగ్లో ఉన్న అద్దెలను చెల్లించాలని అన్నారు. పలు ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

మద్యంషాపులు నియమ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - సీతానగరం : సీతానగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బెల్ట్ షాపుల నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఇప్పటివరకు 145 మంది నిర్వాహకులపై కేసులు నమోదుచేసి వారి వద్ద నుంచి 226 లీటర్లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. మద్యం షాప్ యజమానులు చట్టంలోగల నియమ నిబంధనలను పాటించాలని, మద్యాన్ని ఎం ఆర్ పి ధరలకే విక్రయించాలని, ఎక్కడైనా గొలుసు దుకాణాలు ఉన్నచో టోల్‌ఫ్రీ నెంబర్ 14405కి లేదా 9440902373 నెంబరుకి తెలియ పరచాలన్నారు.

ప్రధాని మోడీ చిత్రపటానికి బిజెపి ఆధ్వర్యంలో పాలాభిషేకం

విశాలాంధ్ర-చింతూరు : బిజెపి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి శనివారం పాలాభిషేకం నిర్వహించారు. నెక్స్ట్ జనరేషన్ జీఎస్టి సంస్కరణలు సామాన్యులకు, రైతులకు,విద్యార్థులకు, ఎం ఎస్ ఎం లకు అన్ని వర్గాలు ప్రజలకు మేలు చేసే విధంగా జీఎస్టీ సంస్కరణ తీసుకువచ్చిన నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతా రామన్ కు చింతూరు బిజెపి నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతూరు బిజెపి మండల అధ్యక్షులు బట్ట లక్ష్మయ్య తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్, ఎస్. కె. యం. జానీ, జనసేన చింతూరు మండల అధ్యక్షులు రాజు, ఎస్టీ సెల్ మోర్చా కార్యదర్శి సుప్రజ, మహిళ బిజెపి నాయకులు బుక్కిలి కన్నమ్మ, సోడిపిచ్చమ్మ, మినప సీతమ్మ. కూటమి నాయకులు కోస ప్రసాద్ రావు, సోడే మధు, బిజెపి నాయకులు శివాజీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడిని సత్కరించిన ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం : రాష్ట్ర స్థాయిలో ఉత్తమఉపాధ్యాయుడిగా ఇటీవలఅవార్డు పొందిన తెర్లీ రవికుమార్ ను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సత్కరించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో కలిసిన రవికుమార్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో పార్వతీపురం జూనియర్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకులుగా పనిచేసిన రవికుమార్ ఇటీవల గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన సంగతి తెలిసినదే.

ఐటిడిఏ ఆయిల్ బంక్‌లో నో స్టాక్ బోర్డు దర్శనం

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- వారానికొకసారి ఇదే పద్ధతి పాటిస్తున్న ఐటీడీఏ

విశాలాంధ్ర-సీతంపేట : మండల కేంద్రంలో ఐటీడీఏ ఆయిల్ బంక్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని వాహనదారులు అసహనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ నిర్వహించిన ఆయిల్ బంకులో ఆయిల్ క్వాలిటీ బాగుంటుంది అని తమ వాహనాలకు ఎటువంటి మరమ్మత్తులు కావని ఐటిడిఏ పై ఉన్న నమ్మకంతో సీతంపేట మండల కేంద్రంలో వాహనదారులతో పాటు చుట్టుపక్కల వారు కూడా సీతంపేట బంకులో ఆయిల్ వాడకం చేస్తున్నారు. అయితే ఈ మధ్యకాలంలో వారంలో ఒక రోజు నుండి రోజున్నర వరకు ఆయిల్ సకాలంలో సీతంపేట బంక్ లో పెట్రోల్ డీజిల్ నిల్వలు లేకపోవడంతో సిబ్బంది నో స్టాక్ బోర్డు పెట్టి కర్రలను అడ్డంగా కట్టి వేయడంతో. వాహనదారులు మరియు ఇతర ప్రాంతాల నుండి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని అవసరం నిమిత్తము ప్రైవేట్ వ్యాపారస్తులు వద్ద ఆయిల్ కొనుగోలు చేస్తున్నప్పటికీ లీటర్‌కు అదనంగా 20 రూపాయలు వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయిల్ కొలతల్లో కూడా వ్యత్యాసము ఉండటంతో చేసేదిలేక మానసిక ఆవేదన కు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి ఈ సమస్యను పునరావృతం కాకుండా సకాలంలో ఆయిల్ ట్యాంకర్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వైకాపా ఆరోపణల్లో అర్థం లేదు

రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి గోళ్ళ చంటిబాబు

విశాలాంధ్ర-దేవీపట్నం : రైతుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజారంజకపాలనను అందిస్తుందని రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి గోళ్ళ చంటిబాబు అన్నారు.శనివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని తుంగలో తొక్కి వారికి ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మోసం చేసిన ప్రభుత్వం వైకాపా అని మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మిపై ధ్వజమెత్తారు. పైగా ఈరోజు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటు అని అయన ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసం చేసిందని, రైతు భరోసా కింద వారికి కేవలం రెండు దపాలలో రూ. 13,000 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మొదటి విడతగా 7వేల రూపాయలను విడుదల చేసి మరో రెండు దపాల్లో మొత్తం 20 వేలను విడుదల చేసి ఇచ్చిన హామీని కచ్చితంగా నిలబెట్టుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలన్నింటిని దిగ్విజయంగా అమలు చేస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని కొనియాడారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా మహిళల ఆర్థిక అభివృద్ధి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వమేనని పునరుద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే సబ్సిడీతో ఎరువులు, విత్తనాలను అందిస్తుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వైసీపీ నాయకుల అర్థంపర్థం లేని ఆరోపణలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రైతులకు ఏం చేసిందో గుర్తు చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు జోలె పట్టుకుని సంతల్లో అడుక్కున్న పరిస్థితిని ఆయన గుర్తు చేశారు. అటువంటివారు ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని, లేకపోతే ప్రజల నుంచి తగిన గుణపాఠం నేర్చుకోవాల్సి వస్తుందని అయన హెచ్చరించారు.

ఆక్రమణ స్థలం తొలగింపు

విశాలాంధ్ర-కురుపాం : సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎదురుగా ఉన్నటువంటి ప్రభుత్వ స్థలం వద్ద ఆక్రమించినటువంటి స్థలాలు వద్ద ఉన్నటువంటి సామాగ్రిని శనివారం ఆర్ ఐ పి. దిలీప్, వీఆర్వో పి. మహేంద్ర తన సిబ్బందితో కలిసి తొలగింపు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలములో ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్ఏ జి. ఈశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా హిందీ భాషా వారోత్సవాలు

విశాలాంధ్ర-కొయ్యూరు : కొయ్యూరు మండలం మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ దివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధా హిందీ భాష ప్రాచీనత, భవిష్యత్ అవకాశాలను వివ రించారు. వైస్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి విధ్యార్థులు అన్నీ భారతీయ భాషలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, హిందీ ద్వారా జాతీయ సమాక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందీ లెక్చరర్ ఎస్. సౌమిత్రి హిందీ భాష ప్రాధాన్యం, జాతీయ ఐక్యతలో దాని పాత్ర, విద్యార్థుల్లో హిందీపై ఆసక్తి పెంపొందించటం వంటి అంశాలపై తెలిపారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

నీలకంఠపురంను ఏజెన్సీ మండలంగా ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-కురుపాం: మండలంలోని నీలకంఠా పురంను ప్రత్యేక గిరిజన మండలముగా ఏర్పాటు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 15 సోమవారం ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సర్పంచ్ అద్దాకుల మన్మథ రావు ప్రకటించారు. తూర్పు ముఠాలోని అన్ని పంచాయతీలలో రావాలని గ్రామాల్లో ముందుగా సమావేశాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలను సర్పంచులను మహిళలను యూత్ వివిధ సంఘాలను పిలవడం జరుగుతుందని కావున నీలకంఠాపురం చుట్టుపక్కల 12 పంచాయతీల ప్రతినిధులు అందరూ ప్రజలు సోమవారం నాడు జరగబోవు ర్యాలీకి పెద్ద ఎత్తున వేల సంఖ్యలో జనం హాజరు కావాలని కోరారు.

జడ్పీ పాఠశాలలో హిందీ ప్రచార సభ పరీక్షలు

విశాలాంధ్ర- కురుపాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విశారధ, భూషణ్, విద్వాన్ పరీక్షలకు 28 మందికి 27 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ టి.శంకరరావు, హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్ కూమార్ తెలిపారు. అనంతరం పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో ఎన్. సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.

11 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్, మరో వ్యక్తి పరార్

విశాలాంధ్ర-కొయ్యూరు : ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 11 కిలోల గంజాయితో పాటు ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందని కొయ్యూరు ఎస్సై కిషోర్వర్మ తెలిపారు. కొయ్యూరు పోలీసులకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో చీడి పాలెం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా మోటార్ సైకిల్ పై ఇద్దరు వ్యక్తులు గంజాయితో వస్తున్నట్లు గుర్తించి తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి చేబ్రోలుగ్రామానికి చెందిన కర్రీ పవన్ కుమార్ తప్పించుకొని పరార్ అయ్యారన్నారు మరో వ్యక్తి పైరుమల కోవెల జోగేంద్రను గంజాయితోపాటు బైకును స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి పట్టుబడిన జోగేంద్రను డిమాండ్కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇటువంటి సంఘటనలకు ఎటువంటి వ్యక్తులు పాల్పడిన అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై కిషోర్ వర్మ హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి... మెడికల్ కాలేజీలపై కాదు...

- కూటమి ప్రభుత్వానికి మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి డిమాండ్
- చౌకబారు విమర్శలు మానుకోండి
- కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరికి హితవు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రం లో ఉన్న మెడికల్ కాలేజీలను పి పి పి (పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం) పద్ధతి పేరు చెప్పి ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ఈ కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా ప్రజా పోరాటం చేస్తామని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి అన్నారు ఆమె చినమేరంగి గ్రామంలో తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల పేదలకు తీవ్ర ఇబ్బందులు తప్ప వ న్నారు మెడికల్ కళాశాలలను ప్రైవేటువరం చేస్తామని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని గత వైసిపి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారని అందులో ఏడు మెడికల్ కళాశాలలను ప్రారంభించి తరగతులు నిర్వహణ కూడా జరుగుతున్నాయని అన్నారు కానీ ఆయనపై బురదజల్లేందుకు కొంతమంది మంత్రులు ఏవేవో కుంటి సాకులు చెబుతూ ప్రజలకు తప్పుతావు పట్టిస్తున్నారని ఆమె మండిపడ్డారు వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనిఆమె డిమాండ్ చేశారు మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తామంటే కచ్చితంగా రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటం చేస్తామని అన్నారు నియోజకవర్గంలో ఉన్న భద్రగిరి కురుపాం చినమేరంగి సి హెచ్ సి లలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పట్టించుకున్నారా ప్రశ్నించారు.. అంతేకాకుండా నియోజకవర్గ పరిధిలో ఎన్నడూ లేని విధంగా డ్రగ్ ఇన్స్పెక్టర్లను ఫుడ్ ఇన్స్పెక్టర్లను ఎప్పుడైనా ఇన్నిసార్లు చూశామా అని ఆమె అసహనం వ్యక్తం చేశారు.అంతేకాకుండాఆర్ఎంపీలు పీఎంపీలపై బెదిరింపుల పర్వం గతంలో ఎప్పుడైనా ఉందా బెదిరింపులు కారణంగా గ్రామాలలో ఉన్న కనీస ప్రథమ చికిత్స సదుపాయం కూడా చేయాలంటే వారు ఇబ్బంది పడుతున్నారన%శీ%టూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారుప్రస్తుతం కురుపాం నియోజకవర్గ శాసన సభ్యురాలు తోయక జగదీశ్వర్ కి అసలు పరిపాలనపై అవగాహన ఉందా?అని అమె ప్రశ్నించారు ఆమె బాధ్యత రాహిత్యంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు ప్రస్తుత నియోజకవర్గంలో యూరియా తీవ్ర కొరత ఉన్న పట్టించుకోవడం లేదు సరి కదా యూరియా ఇచ్చామని కొరత లేదని అనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు యూరియా కొరతపై ఆమె నియోజకవర్గంలో రైతుల పేర్లు చెప్పి వారికి ఇచ్చిన యూరియా తీరును విలేకరుల ముందు ఉంచారు అంతేకాకుండా ఒక రైతుకు తన పాస్ పుస్తకంలో ఎన్ని ఎకరాలు పాస్ పుస్తకానికి ఒక బస్తా యూరియా ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో దీర్ఘకాలికమైన సమస్యలపై దృష్టి సారించాలని ఆమెహితవు పలికారు ఈ ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి జియ్యమ్మ వలస వైసీపీ మండల కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు